స్వకృషి
సహకార ఉద్యమం

# స్వకృషి ధాన్య విత్తన సంఘాల ప్రగతి నివేదిక - 2020-21

స్వయం సహాయం, పరస్పర సహాయం, ప్రజాస్వామ్యం ప్రాతిపదికలుగా ఒకే రకమైన అవసరాలున్న కొంత మంది వ్యక్తులు కలిసి తమ అవసరాలను తీర్చుకొనుటకు సహకార సంఘాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. తాలు, బెరుకులు, ఇతర వ్యర్థ పదార్థాలు లేకుండా, తేమ శాతం 13కు మించకుండా, ఎక్కువ దిగుబడిని అందించగల ధాన్య విత్తనాన్ని నాణ్యమైన విత్తనం అనవచ్చు. నాణ్యమైన ధాన్య విత్తన ఉత్పత్తి, సేకరణ, సంసాధన మరియు విపణి సేవలను అందించే సహకార సంఘాలను ధాన్య విత్తన సంఘాలుగా వ్యవహరిస్తున్నాము. ఈ సంఘాలలోని సభ్యులు తమ నియంత్రణతో, తమ సొంత నిధులతో, తమ శ్రేయస్సు కొరకు సమర్థవంతమైన సేవలను పొందడం ద్వారా తమ ఆర్థిక, సామాజిక స్థితిని మెరుగుపరచుకోవటానికి తామే ఏర్పాటుచేసుకున్న సహకార సంఘాలు స్వకృషి ధాన్య విత్తన సంఘాలు.

1999లో వరంగల్ జిల్లాలోని మక్థుంపురం, కరీంనగర్ జిల్లాలోని గంగిపల్లి, పోరండ్ల, ధర్మరాజుపల్లి గ్రామాలలో ధాన్య విత్తన సంఘాలను రైతులు ఏర్పాటు చేసుకున్నారు. ఈ సంఘాల ఏర్పాటుకు సహవికాస సహాయ, సహకారాలను అందించినది.

**ఈ సంఘాల ముఖ్య ఉద్దేశం:**

నాణ్యమైన ధాన్య విత్తన ఉత్పత్తి, సేకరణ, సంసాధన మరియు విపణి సేవలు అందించుట ద్వారా సభ్యుల ఆర్థిక, సామాజిక స్థితిని మెరుగుపరచటమేకాక వేల మంది చిన్న, సన్నకారు రైతులకు నాణ్యమైన విత్తనాన్ని అందించడమే ఈ సంఘాల ముఖ్య ఉద్దేశం.

ఈ సంఘాలు పటిష్టవంతంగా పనిచేయడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించడానికి సహకార వికాస సంస్థ (సహవికాస) గత 22 సంవత్సరాలుగా కృషి చేస్తున్నది. గతంలో ధాన్యాన్ని పండించే రైతులు నాణ్యమైన విత్తనం దొరకక చాలా ఇబ్బంది పడేవారు. కల్తీ విత్తనాన్ని కొని రైతులు మోసపోయేవారు. ఈ సంఘాలు ఏర్పాటైన తర్వాత ఈ సంఘాలు ఉత్పత్తి చేస్తున్న నాణ్యమైన ధాన్య విత్తనాన్ని వేల మంది చిన్న, సన్నకారు రైతులు వినియోగించుకొని లాభపడుతున్నారు.



*మక్థుంపురం ధాన్య విత్తన సంఘం 20వ వార్షిక మహాసభలో ప్రసంగిస్తున్న సంఘ సభ్యుడు*

ఈ సంఘాలు వివిధ వ్యవసాయ పరిశోధనా క్షేత్రాల నుండి బ్రీడర్ విత్తనాన్ని కొనుగోలు చేసి, సభ్యులకు సరఫరా చేసి, వారి నుండి ఫౌండేషన్ ముడి విత్తనాన్ని సేకరిస్తాయి. అట్టి విత్తనాన్ని శుద్ధిచేస్తే ఫౌండేషన్ విత్తనం వస్తుంది. తిరిగి ఈ విత్తనాన్ని సభ్యులకు సరఫరా చేసి, వారి నుండి ట్రుత్‌ఫుల్ ముడి విత్తనాన్ని సేకరిస్తాయి. అట్టి విత్తనాన్ని శుద్ధిచేస్తే ట్రుత్‌ఫుల్ విత్తనం వస్తుంది. ఈ విత్తనాన్ని 30 కిలోల బస్తాలలో ప్యాకింగ్ చేసి స్థానికంగా, ఇతర ప్రాంతాలలో విక్రయిస్తాయి. మక్దుంపురం, ధర్మరాజుపల్లి సంఘాలు 2020-21లో (1.04.2020 నుండి 31.03.2021 వరకు) దాదాపుగా 12 వేల క్వింటాళ్ళ నాణ్యమైన విత్తనాన్ని తమ బ్రాండ్ పేర్ల మీద మార్కెట్ చేసాయి. సగటున ఒక రైతు 3 ఎకరాల భూమిలో ధాన్యాన్ని పండిస్తున్నట్లుగా భావిస్తే ఈ సంఘాలు విక్రయించే విత్తనం దాదాపు 14 వేల మంది చిన్న, సన్నకారు రైతులు వినియోగించుకున్నారు. ఈ రైతులు తెలంగాణాలోని 17జిల్లాలలో, ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కర్ణాటకలోని రాయచూర్, సిరికుప్ప ప్రాంతాలకు చెందినవారై ఉన్నారు. వీరు ఈ సంఘాలు ఉత్పత్తి చేస్తున్న నాణ్యమైన విత్తనాన్ని కొనుగోలు చేసి మంచి దిగుబడులను పొంది లాభాలను ఆర్జించాలని సహవికాస ఆశిస్తున్నది.

ఈ సంఘాలు ఏర్పాటై 22 సంవత్సరాలు పూర్తైనవి. ఈ కాలంలో ఈ సంఘాలకు సహవికాస రెండు రకాలుగా ఆర్థిక సహాయాన్ని అందించినది. గోదాముల నిర్మాణం, యంత్రాల కొనుగోలుకై నిర్ణీత నిక్షేపాల రూపంలో, వ్యాపార నిర్వహణకై పిలుపు నిక్షేపాల రూపంలో ఆర్థిక సహాయం అందించినది.

ఈ సంఘాల ఆర్థిక సంవత్సరం 1 ఏప్రిల్‌తో ప్రారంభమై 31 మార్చితో ముగియును. ధాన్య విత్తన సంఘాల ఉపవిధుల ప్రకారం ఆర్థిక సంవత్సరం పూర్తైన మూడు నెలలలోపు ఈ సంఘాలు మహాసభలు నిర్వహించు కోవలసి ఉంటుంది.

ధాన్యవిత్తన సంఘాలలో ప్రతి సంవత్సరం రొటేషన్ పద్ధతిలో పాలకవర్గంలో 3 స్థానాలు ఖాళీ అవుతాయి. ఈ ఖాళీ అయిన స్థానాలను పూరించుటకై మహాసభకు 5 రోజుల ముందు అర్హత కలిగిన సభ్యుల నుండి నామినేషన్లు స్వీకరించబడుతాయి. మూడుకు మించి నామినేషన్లు వచ్చినట్లైతే వార్షిక మహాసభ రోజు రహస్యబ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించబడుతాయి. పోటీ చేసిన అభ్యర్థుల నుండి ముగ్గురిని పాలకవర్గ సభ్యులుగా ఈ ఎన్నికలలో సభ్యులు ఎన్నుకుంటారు. 2020-21 సంవత్సరానికిగాను 1 సంఘం రహస్యబ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించుకున్నది.

31.03.21నాటికి రెండు సంఘాలలో 245 సభ్యులు ఉన్నారు. వీరి నిధులు రూ 356 లక్షలు ఉన్నాయి. ఈ సంఘాలు 31.03.21నాటికి రిజర్వులకు కేటాయించుకున్న మొత్తం రూ 271 లక్షలు కలదు. ఈ సంఘాలు మ్యాక్స్ చట్ట పరిధిలో నమోదైనాయి.

విత్తన నాణ్యతా ప్రమాణాలు రెండు, (1) కల్తీ విత్తనాన్ని గుర్తించటం, (2) తేమశాతాన్ని గుర్తించటం. సభ్యుల నుండి సేకరిస్తున్న ముడి విత్తనంలోని కల్తీ విత్తనాన్ని గుర్తించటానికి ఈ సంఘాలు భూతద్దాలను వినియోగిస్తున్నాయి. విత్తనంలో

కల్తీ ఉన్నట్లుగా గమనిస్తే అట్టి విత్తనాన్ని తిరస్కరించాలి. అలాగే విత్తనంలోని తేమశాతం 13కు మించి ఉన్నట్లయితే అట్టి విత్తనం ఎక్కువకాలం నిల్వ ఉండదు. కనుక తేమ శాతాన్ని పరిశీలించడానికి మాయిశ్చర్ మిషన్‌ను ఈ సంఘాలు వాడుతున్నాయి.

**సభ్యుల ప్రగతి పొదుపులు:**

సభ్యుల పేరున ఒక ఖాతాను ఏర్పాటు చేసి ఆ సభ్యులు సంఘానికి సరఫరా చేసిన విత్తనం విలువలో 3% నుండి 5% మొత్తాన్ని ఆ ఖాతాకు జమ చేయడం జరుగుతుంది. ఈ విధంగా జమైన మొత్తాలను ప్రగతి పొదుపులుగా వ్యవహరిస్తున్నాము.

**సభ్యుల ప్రగతి పొదుపుల ఉద్దేశం:**

- వృద్ధాప్య సమయంలో సభ్యులకు తాను ప్రోగుచేసుకున్న ప్రగతి పొదుపులు ఆసరాగా ఉంటాయి.
- సంఘంలో సభ్యుల నిధులు పెరగడం ద్వారా సంఘం సభ్యుల సొంతం అవుతుంది. సభ్యులు సంఘంపై బాధ్యత, అధికారం కలిగి ఉండటం వలన సంఘం విజయవంతంగా నడుస్తుంది.
- వ్యాపార వ్యవహారాల నిర్వహణకు సంఘానికి కొంత నగదు అవసరం. ఈ నగదు కోసం ఇతర సంస్థల నుండి అప్పు తెచ్చుకొని వారికి వడ్డీ చెల్లించడం కంటే, సభ్యుల బిల్లుల నుండి 3% నుండి 5% ప్రగతి పొదుపులను సంఘంలో సభ్యుల ప్రగతి పొదుపుల ఖాతాకు జమ చేసి, వీటిపై వడ్డీని జమ చేయడం ద్వారా సభ్యులకు ప్రయోజనం కలుగుతుంది.

సభ్యత్వం ముగించుకున్న రోజున తాను సంఘంలో జమచేసుకున్న ప్రగతి పొదుపులను, వాటిపై వడ్డీని కలిపి సంఘం సభ్యులకు చెల్లించడం జరుగుతుంది. ప్రగతి పొదుపులు వాపస్ తీసుకున్న వారి నుండి తిరిగి ధాన్య విత్తనం సేకరించబడదు.

**బ్రీడరు విత్తనం:** ఈ రెండు సంఘాలలో సంవత్సర ప్రారంభంలో నిల్వ ఏమీ లేదు. ఈ సంవత్సరంలో ఫౌండేషన్ ముడి విత్తన ఉత్పత్తికై వ్యవసాయ పరిశోధనా క్షేత్రాల నుండి 13 క్వింటాళ్ళు కొనుగోలు చేసినారు. తమ సభ్యులకు 13 క్వింటాళ్ళు పంపిణీ చేసినారు. ముగింపు నిల్వ ఏమీ లేదు.

**ఫౌండేషన్ ముడి విత్తనం:** సంవత్సర ప్రారంభంలో 621 క్వింటాళ్ళ నిల్వ కలదు. ఈ సంవత్సరంలో 588 క్వింటాళ్ళ విత్తనాన్ని సేకరించినాయి. మొత్తం ఫౌండేషన్ ముడి విత్తనం 1,209 క్వింటాళ్ళు. 86 క్వింటాళ్ళను ధాన్యంగా అమ్మినాయి. 649 క్వింటాళ్ళను శుద్ధి చేసినాయి. ముగింపు నిల్వ 474 క్వింటాళ్ళు కలదు. 649 క్వింటాళ్ళను శుద్ధి చేయగా, 592 క్వింటాళ్ళ (91%) విత్తనం, 30 క్వింటాళ్ళ (5%) స్మాల్ సీడ్, 27 క్వింటాళ్ళ (4%) తరుగుదల వచ్చినది.

**ఫౌండేషన్ విత్తనం:** సంవత్సర ప్రారంభంలో 78 క్వింటాళ్ళు నిల్వ కలదు. ఫౌండేషన్ ముడి విత్తనాన్ని శుద్ధి చేయగా వచ్చిన విత్తనం 592 క్వింటాళ్ళు. సేకరించిన విత్తనం 8 క్వింటాళ్ళు. మొత్తం ఫౌండేషన్ విత్తనం 678 క్వింటాళ్ళు, ఇందులో నుండి 588 క్వింటాళ్ళు విత్తనంగా, 90 క్వింటాళ్ళు ధాన్యంగా అమ్మినాయి. ముగింపు నిల్వ ఏమి లేదు.

**ట్రుత్‌ఫుల్ ముడి విత్తనం:** సంవత్సర ప్రారంభంలో 11,323 క్వింటాళ్ళ నిల్వ కలదు. ఈ సంవత్సరంలో 23,772 క్వింటాళ్ళ విత్తనాన్ని సేకరించినాయి. మొత్తం ట్రుత్‌ఫుల్ ముడి విత్తనం 35,095 క్వింటాళ్ళు, 15,786 క్వింటాళ్ళు ధాన్యంగా అమ్మినాయి. 12,006 క్వింటాళ్ళను శుద్ధి చేసినాయి. 566 క్వింటాళ్ళ తూకంలో భేదం వచ్చినది. ముగింపు నిల్వ 6,737 క్వింటాళ్ళు కలదు. 12,006 క్వింటాళ్ళను శుద్ధి చేయగా, 11,072 క్వింటాళ్ళ (92%) విత్తనం, 523 క్వింటాళ్ళ (4%) స్మాల్ సీడ్, 411 క్వింటాళ్ళ (4%) తరుగుదల వచ్చినది.

**ట్రుత్‌ఫుల్ విత్తనం:** సంవత్సర ప్రారంభంలో 119 క్వింటాళ్ళ నిల్వ కలదు. ట్రుత్‌ఫుల్ ముడి విత్తనాన్ని శుద్ధి చేయగా వచ్చిన విత్తనం 11,072 క్వింటాళ్ళు. సేకరించిన విత్తనం 1,036 క్వింటాళ్ళు. మొత్తం ట్రుత్‌ఫుల్ విత్తనం 12,227 క్వింటాళ్ళు. ఇందులో నుండి 11,259 క్వింటాళ్ళు విత్తనంగా, 753 క్వింటాళ్ళు ధాన్యంగా అమ్మినాయి. ముగింపు నిల్వ 215 క్వింటాళ్ళు కలదు.

2020-21లో (1.04.2020 నుండి 31.03.2021 వరకు) మక్ధుంపురం సంఘం రూ 3 లక్షల 15 వేల మిగులును ఆర్జించినది. సంఘానికి విత్తనం సరఫరా చేసిన సభ్యులకు ఈ సంఘం క్వింటాలుకు రూ 37ల చొప్పున ధరల వ్యత్యాసాన్ని అందించగలుగుతుంది. అదేవిధంగా 31.03.2021నాటికి ధర్మరాజుపల్లి సంఘం రూ 5 లక్షల 12 వేల మిగులును ఆర్జించినది. సంఘానికి విత్తనం సరఫరా చేసిన సభ్యులకు ఈ సంఘం క్వింటాలుకు రూ 10ల చొప్పున ధరల వ్యత్యాసాన్ని అందించగలుగుతుంది.

స్వకృషి ధాన్య విత్తన సంఘాలు నాణ్యమైన విత్తనాన్ని రైతులకు అందిస్తూ పలువురికి ఆదర్శంగా ఉంటాయని సహవికాస ఆశిస్తున్నది.

- X -